కుంభకోణాల కుంభమేళా..
సింగరేణిలో కాంగ్రెస్ స్కాముల గోల : కేటీఆర్
సింహ గర్జన
2

Neti Velugu
నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
RNI NO. TELTEL/2023/88559
తెలుగు దినపత్రిక
www.epaper.netivelugu.com
netivelugu63@gmail.com



నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 184 | పేజీలు : 8 | అక్టోబర్ 15 గురువారం 2026 | వెల రూ. 4.00/-
NALGONDA | VOL:3 | ISSUE: 184 | PAGES:8 | THURSDAY OCTOBER 15 2026 | Rs. 4:00

గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్లకు తెలంగాణ బెస్ట్ డెస్టినేషన్

సీఎం రేవంత్ రెడ్డి



- ప్రపంచ పెట్టుబడులకు తెలంగాణను ఉత్తమ గమ్యస్థానంగా మారుస్తాం
- 'క్యూర్, ప్యూర్, రేర్' జోన్లతో సమగ్రాభివృద్ధికి ప్రణాళిక
- 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ
- దేశ జీడీపీలో రాష్ట్ర వాటాను 10 శాతానికి పెంచడమే లక్ష్యం
- రాజకీయాలు ఎన్నికలకే పరిమితం.. అభివృద్ధిపైనే మా దృష్టి

ప్రపంచ పెట్టుబడులకు తెలంగాణను అత్యుత్తమ గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ సంకల్పమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దేశ జీడీపీలో ప్రస్తుతం 5 శాతంగా ఉన్న తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆయన తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఫెడరేషన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఈ సందర్భంగా 'తెలంగాణ రైజింగ్: 2047 విజన్ డాక్యుమెంట్'ను వివరిస్తూ, రాష్ట్రాన్ని మూడు ప్రధాన జోన్లుగా విభజించి అభివృద్ధి చేయాలన్న తమ ప్రణాళికను వెల్లడించారు. "2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్

(మిగతా 2వ పేజీలో..)

బెజవాడ దుర్గమ్మను దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

- విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు
- గన్నవరం విమానాశ్రయంలో రాష్ట్రపతికి ఘన స్వాగతం పలికిన ప్రముఖులు
- ఆలయంలో వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్న రాష్ట్రపతి
- దర్శనం కోసం వేచి ఉన్న భక్తులను ఆప్యాయంగా పలకరించిన ముర్ము

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్న వేళ ఆమె అమ్మవారి సన్నిధికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ పర్యటన కోసం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో

(మిగతా 2వ పేజీలో..)



కమిషన్ల కోసమే సింగరేణిని దోచుకుంటున్నారు: రేవంత్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

వాటాలు తేలకపోవడం వల్లే నైని టెండర్లు రద్దు చేశారని విమర్శ

సైట్ విజిట్ సర్టిఫికెట్ పేరుతో రూ.10,000 కోట్ల కుంభకోణం జరిగిందన్న కేటీఆర్

సింగరేణి అక్రమాలపై ఆధారాలతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశామని వెల్లడి

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్ల కోసం సింగరేణి సంస్థను పంచుకొని దోచుకుంటోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి.రామారావు (కేటీఆర్) ఆరోపించారు. సింగరేణిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏమాత్రం శ్రద్ధ లేదని, ఆయన పాలనలో సంస్థ భ్రష్టుపట్టిపోతోందని విమర్శించారు.



(మిగతా 2వ పేజీలో..)

మళ్లీ నిరసనలకు పిలుపునిచ్చిన సీజేపీ.. అక్టోబర్ 16న లెహ్రో దో తిరంగా పేరుతో ఆందోళన

జఙ్రో జూతీశేవర్ : సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో ఇప్పటివరకు పూర్తిస్థాయి ఆందోళన చేపట్టలేకపోయింది సీజేపీ. ఈ నేపథ్యంలో మరోసారి భారీ ఆందోళనలకు పిలుపునిచ్చింది. అక్టోబర్ 16, శుక్రవారం 'లెహ్రో దో తిరంగా' పేరుతో ఆందోళన చేపట్టాలని సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే బుధవారం పిలుపునిచ్చారు. లెహ్రో దో తిరంగా అంటే మూడు రంగుల జాతీయ పతాకాన్ని ఊపడం అని



(మిగతా 2వ పేజీలో..)

పాలమూరు బాధితులకు రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలి : హరీష్‌రావు డిమాండ్

గద్వాల / పాలమూరు: కర్ణాటకలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన పాలమూరు దళిత బాధితులకు తక్షణమే ప్రభుత్వం రూ.10 లక్షల పరిహారాన్ని అందించాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు డిమాండ్ చేశారు. ఈ ప్రమాదంలో మరణించిన బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు.కర్ణాటక రాష్ట్రంలోని యాదగిరి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి అండగా నిలవాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సూచించడంతో తాము ఇక్కడికి



(మిగతా 2వ పేజీలో..)

తీహార్ జైలుకు వెళ్లిన సీజేపీ నేతలకు బాసటగా రాహుల్ గాంధీ

జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపిన సీజేపీ నేతలకు ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ

అరెస్టులను తీవ్రంగా ఖండించిన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

త్రివర్ణ పతాకాన్ని ఎగరేయడం నేరం కాదని వ్యాఖ్య



(మిగతా 2వ పేజీలో..)

నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

కమిషన్ల కోసమే సింగరేణిని దోచుకుంటున్నారు: రేవంత్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో అక్టోబర్ 14న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సింగరేణి కార్మిక గర్జన' సభలో ఆయన ప్రసంగించారు.కమిషన్ల లెక్కలు తేలకపోవడం వల్లే నైని టెండర్లను ప్రభుత్వం రద్దు చేసిందని కేటీఆర్ ఆరోపించారు. నైని కుంభకోణాన్ని ఆపి రూ.30,000 కోట్లు ఆదా చేశామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పడాన్ని ప్రస్తావిస్తూ.. ప్రభుత్వ పెద్దల మధ్య వాటాలు తేలనప్పుడే ఇలాంటి కుంభకోణాలు బయటకు వస్తాయని ఎద్దేవా చేశారు. 'సైట్ విజిట్ సర్టిఫికెట్' అనే కొత్త నిబంధన పేరుతో సింగరేణిలో సుమారు రూ.10,000 కోట్ల భారీ కుంభకోణం జరుగుతోందని కేటీఆర్ సంచలన ఆరోపణ చేశారు. దీనితో పాటు సోలార్, జిలెటిన్ స్టిక్స్ కొనుగోళ్లు, మరో నాలుగైదు అంశాల్లోనూ పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని దుయ్యబట్టారు.సింగరేణి కార్మికుల జీవితాలను నాశనం చేస్తున్న ఈ అక్రమాలపై ఆధారాలతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశామని కేటీఆర్ వెల్లడించారు. ఇప్పటికే సింగరేణిలో జరుగుతున్న దోపిడీపై చర్యలు తీసుకోవాలని కిషన్ రెడ్డి సైతం ముఖ్యమంత్రికి లేఖ రాసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అధికార పార్టీ నేతలు ఒకరినొకరు కాపాడుకుంటూ, కమిషన్ల కోసం సింగరేణిని కొల్లగొడుతున్నారని ఆయన మండిపడ్డారు. సింగరేణిలో జరుగుతున్న అవకతవకలపై బీఆర్ఎస్ చేస్తున్న పోరాటంలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

బెజవాడ దుర్గమ్మను దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

(మొదటి పేజీ తరువాయి)

గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కమలేశ్ పాశ్వాన్, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, ఎంపీ వల్లభనేని బాలశౌరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు ఆమెకు స్వాగతం పలికారు.అనంతరం ఇంద్రకీలాద్రికి చేరుకున్న రాష్ట్రపతికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రాష్ట్ర హోంమంత్రి అనిత, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ఆలయ చైర్మన్ రాధాకృష్ణ, ఈవో షీనా నాయక్ ఆమెను ఆలయంలోకి ఆహ్వానించారు. గర్భాలయంలో అమ్మవారిని దర్శించుకున్న అనంతరం, వేద పండితులు రాష్ట్రపతికి వేదాశీర్వచనాలు అందించారు. ఆలయ అధికారులు ఆమెకు పట్టువస్త్రాలు, అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులను రాష్ట్రపతి ఆప్యాయంగా పలకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ ఆమె ముందుకు సాగారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

మళ్లీ నిరసనలకు పిలుపునిచ్చిన సీజేపీ.. అక్టోబర్ 16న లెహ్రో దో తిరంగా పేరుతో ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

అర్థం.ఢిల్లీ, బిజినెస్ హబ్ పరిధిలోని, కన్నాట్ ప్లేస్, సెంట్రల్ పార్క్ వద్ద ఈ ఆందోళన చేపట్టనున్నట్లు అభిజీత్ దీప్కే వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు జాతీయ జెండాతో రావాలని ఆయన పిలుపునిచ్చారు. అంతేకాదు.. జెండా ఎగురవేసినందుకే సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను జైలులో పెట్టారని దీప్కే విమర్శించారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు, కేంద్ర ప్రభుత్వ తీరుపై దీప్కే విమర్శలు చేశారు. తిరంగా జెండాను ఊపడం నేరమా అంటూ ప్రశ్నించారు.ఢిల్లీలో అనుమతి లేకుండా ఆందోళన చేసి, శాంతి భద్రతలకు విఘాతం కల్పించినందుకుగాను సౌరవ్, రాంకాలను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. వారికి ఐదు రోజుల జుడీషియల్ కస్టడీ విధించింది కోర్టు. దీంతో ఇద్దరూ ప్రస్తుతం ఢిల్లీలోని తిహార్ జైలులో ఉన్నారు. ఇద్దరినీ పోలీసులు వేర్వేరు గదుల్లో ఉంచారు. ఢిల్లీ తిరంగా మార్చ్‌లో పాల్గొనాలని దేశ తన మద్దతుదారులకు పిలుపునిచ్చారు. ఢిల్లీ రాలేని వారు తమ సొంత ప్రాంతాల్లోనే తిరంగా మార్చ్ నిర్వహించాలని సూచించారు. అక్టోబర్ 16న ఢిల్లీలో 'లెహ్రో దో తిరంగా' కార్యక్రమం నిర్వహించి, జెండా ఊపాలని, ఇలా చేయడం నేరం కాదని నిరూపించాలని దీప్కే కోరారు. సీఈసీ రాజీనామా అంశంలో సీజేపీ చేపడుతున్న ప్రతి ఆందోళనను ప్రభుత్వం అణచివేయడమో, అడ్డుకోవడమో చేస్తూ వస్తోంది. అందుకే, సీజేపీ ప్రభావం తక్కువగా కనిపిస్తోంది. అయితే, మరోసారి దీప్కే ఆందోళనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈసారి ఎలాంటి ప్రభావం చూపుతారో చూడాలి.

తీహార్ జైలుకు వెళ్లిన సీజేపీ నేతలకు బాసటగా రాహుల్ గాంధీ

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపినందుకు అరెస్టయిన కాక్‌రోచ్ జనతా పార్టీ (జఖ్రో) నేతలకు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మద్దతుగా నిలిచారు. శాంతియుతంగా నిరసన తెలుపుతూ జాతీయ జెండాను ఎగురవేయడం నేరం కాదని, ఇందుకోసం యువతను జైల్లో పెట్టడం పిరికిపంద చర్య అని ఆయన తీవ్రంగా విమర్శించారు.చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ... నిరసన ప్రదేశం కాదని ఇటీవల ప్రకటించిన జంతర్ మంతర్‌లోకి ప్రవేశించారనే ఆరోపణలపై సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను పోలీసులు నిన్న అదుపులోకి తీసుకున్నారు. ఈ ఉదయం వారిని కోర్టులో హాజరుపరచగా... న్యాయస్థానం వారికి ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. గతంలో ఒకసారి అరెస్టయి, శాంతి ఒప్పందం (పీస్ బాండ్)పై సంతకం చేసి విడుదలైన వీరు... ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించినందున కస్టడీకి పంపినట్లు పోలీసులు తెలిపారు. వీరితో పాటు అరెస్టయిన అజింక్యా షిండే వ్యక్తిగత పూచీకత్తుపై విడుదలయ్యారు.ఈ అరెస్టులపై రాహుల్ గాంధీ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. "జంతర్ మంతర్ భారత ప్రజలది. దానిని మేం తిరిగి స్వాధీనం చేసుకుంటాం. విద్యార్థులు, యువత, జర్నలిస్టులు, ఇండియా కూటమి.. అందరిదీ ఒకే లక్ష్యం. అదే పౌరుల రాజ్యాంగ హక్కుల పరిరక్షణ" అని పేర్కొన్నారు. రాహుల్‌తో పాటు అరవింద్ కేజ్రీవాల్, ఎంకే స్టాలిన్, అభిషేక్ బెనర్జీ, ఆదిత్య థాకరే వంటి పలువురు విపక్ష నేతలు కూడా ఈ అరెస్టులను ఖండించారు. తమకు మద్దతు ప్రకటించినందుకు రాహుల్ గాంధీకి సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ధన్యవాదాలు తెలిపారు.

గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్లకు తెలంగాణ బెస్ట్ డెస్టినేషన్: సీఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే మా లక్ష్యం. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు 'క్యూర్ (జఖ=జు), ప్యూర్ (PURE), రేర్ (RARE)' అనే మూడు జోన్లను అభివృద్ధి చేయాలని సంకల్పించాం" అని వివరించారు.

క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ): హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ (ORR) లోపలి ప్రాంతాన్ని ఐటీ, సేవా రంగాలు, అత్యాధునిక టెక్నాలజీ, ఆవిష్కరణలకు కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

ప్యూర్ (పెరీ-అర్బన్ రీజియన్ ఎకానమీ): ఓఆర్ఆర్, రీజనల్ రింగ్ రోడ్ (RRR) మధ్య ఉన్న ప్రాంతంలో తయారీ పరిశ్రమలు, ఇండస్ట్రియల్ పార్కులు, లాజిస్టిక్స్ రంగాన్ని ప్రోత్సహిస్తామని చెప్పారు.

రేర్ (రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ): గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, గ్రామీణ ఉపాధిపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.

2047 నాటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తవుతాయని, ప్రధాని మోదీ నిర్దేశించిన 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని చేరుకోవడంలో రాష్ట్రాల సహకారం కీలకమని రేవంత్ రెడ్డి అన్నారు. "మా ప్రధాన దృష్టి అభివృద్ధిపైనే ఉంది. రాజకీయాలు కేవలం ఎన్నికలకే పరిమితం కావాలి" అని ఆయన వ్యాఖ్యానించారు.చార్మినార్ నుంచి హైటెక్ సిటీ వరకు హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరంగా ఎలా రూపాంతరం చెందిందో గుర్తుచేశారు. పెట్టుబడిదారులకు స్నేహపూర్వక విధానాలతో పూర్తి రక్షణ కల్పిస్తామని, 'తెలంగాణ రైజింగ్' లక్ష్యాల సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్థానిక పారిశ్రామికవేత్తలు ప్రపంచస్థాయిలో ఎదగాలని ఆకాంక్షించారు. మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, మహిళా, యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు సూచించారు.

పాలమూరు బాధితులకు రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలి : హరీష్‌రావు డిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

వచ్చినట్లు పేర్కొన్నారు.ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారికి పూర్తిస్థాయి వైద్యం అందించడంతోపాటు, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన వారి కుటుంబాలకు, ప్రమాద తీవ్రతను బట్టి బాధితులందరికీ తగిన పరిహారం అందించాలని కోరారు. కొందరు బాధితులకు సరైన వైద్యం అందక, ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయని పేర్కొన్నారు.జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ బాధిత కుటుంబాలను పరామర్శించి ఆదుకునే ప్రయత్నం చేయకపోవడం విచారకరమని విమర్శించారు. ఒకప్పుడు పాలమూరు జిల్లా వ్యవసాయానికి, విత్తనోత్పత్తికి ప్రసిద్ధి చెందిందని హరీష్‌రావు గుర్తుచేశారు. వివిధ రకాల విత్తన పంటల సాగుతో పాటు విత్తన కంపెనీల ద్వారా స్థానికులకు ఉపాధి లభించేదని చెప్పారు.గతంలో సాగునీటి ప్రాజెక్టుల ద్వారా లక్షల ఎకరాలకు నీరు అందించేందుకు చర్యలు తీసుకున్నామని, రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా, రైతుబంధు వంటి పథకాలతో వ్యవసాయానికి అండగా నిలిచామని పేర్కొన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో వ్యవసాయం గిట్టుబాటు కాక, స్థానికంగా ఉపాధి అవకాశాలు తగ్గడంతో కూలీలు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆరోపించారు. వ్యవసాయానికి అవసరమైన నీటిని సమర్థవంతంగా అందించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు. విద్యుత్ సరఫరా, మోటార్ల నిర్వహణలో లోపాల వల్ల చివరి ఆయకట్టు భూములకు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. పాలమూరు ప్రజలు తమ సొంత గ్రామాల్లోనే వ్యవసాయం చేసుకుంటూ గౌరవంగా జీవించే పరిస్థితులు కల్పించాలని, వలసలను అరికట్టేందుకు ఉపాధి అవకాశాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కుంభకోణాల కుంభమేళా.. సింగరేణిలో కాంగ్రెస్ స్కాముల గోల : కేటీఆర్ సింహ గర్జన

మూడేండ్లలోనే సంస్థలో 10 వేల కోట్ల దోపిడీ
సింగరేణి ప్రైవేటీకరణకు కాంగ్రెస్, బీజేపీ కుట్రలు
కార్మిక గర్జన సభలో బీఆర్ఎస్ వర్కింగ్ కేటీఆర్
సర్కార్‌పై మర్లవడి కార్మిక హక్కులు సాధిస్తామని హామీ

నమ్మించి ముంచిన కాంగ్రెస్‌పై సింగరేణి కార్మికులు కదంతొక్కారు. టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో బుధవారం గోదావరిఖనిలో నిర్వహించిన 'సింగరేణి కార్మిక గర్జన' సభకు పోటెత్తారు. సభకు ఒకరోజు ముందుగానే ప్రభుత్వం లాభాల వాటా ప్రకటించినా లెక్క చేయకుండా కేటీఆర్ మీటింగ్‌కు కదలివచ్చారు. మూడేండ్ల కాంగ్రెస్ పాలనలో సింగరేణిని అవినీతిమయంగా మార్చడం, కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేయడం, ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం, సంస్థ ప్రైవేటీకరణకు కుట్రలు చేయడం, వంటి అంశాలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వివరించగా, ఆయనతో గొంతు కలుపుతూ 'సంస్థను నిర్వీర్యం చేసిన కాంగ్రెస్ సర్కార్‌ను వదిలిపెట్టేది లేదు' అంటూ నల్లసూర్యుడు సింహగర్జన చేశారు.

సింగరేణి బొగ్గును బుక్కిన బకాసురుడెవరు?.. బొగ్గును మాయం చేసిన మాయల ఫకీరెవరు?.. సింగరేణి కోల్‌ను గోల్‌మాల్ చేస్తున్న దొంగెవరు? .. సిరుల గనిని స్కామ్‌ల ఖనిగా మార్చిన దుర్మార్గుడెవరు?.. మూడేండ్లలో సింగరేణిలో బొగ్గు నిక్షేపాలు తగ్గినయా?.. కార్మికుల కష్టం తగ్గిందా? మరి బొగ్గెందుకు తగ్గింది?కరీంనగర్, అక్టోబర్ 14(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మూడేండ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో కుంభకోణాల కుంభమేళా జరుగుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సింగరేణిలో సైట్ విజిట్ స్కామ్, డీజిల్ స్కామ్, జిలెటిన్ స్టిక్స్ స్కామ్, సోలార్ స్కామ్, జైపూర్ పవర్ స్కామ్.. ఇలా స్కాముల లిస్ట్ చిత్ర గుప్తుడి చిట్టా కూడా సరిపోనంత పెద్దగా ఉన్నదని దుయ్యబట్టారు. ఇప్పటికే ట్రాన్స్‌కోలో 24శాతం వాటాను ప్రైవేట్ అప్పగించేందుకు ద్వారాలు తెరిచిన రేవంత్ సర్కార్, ఇక సింగరేణిని కూడా ఏ అదానీకో, అంబానీకో అప్పజెప్పి ప్రైవేట్‌పరం చేయాలని కుట్రలు చేస్తున్నదని మండిపడ్డారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో బుధవారం రాత్రి సింగరేణి కార్మిక గర్జన సభలో కేటీఆర్ సుదీర్ఘంగా ప్రసంగించారు. ఈ సందర్భంగా స్వరాజ్య సాధన కోసం ఆనాడు సింగరేణి చేసిన పోరాటాలు త్యాగాలను గుర్తుచేస్తూనే.. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో సింగరేణిలో జరిగిన అభివృద్ధిని కార్మికులకు వివరించారు.ఇదే సమయంలో మూడేండ్లు కాంగ్రెస్ పాలనలో సింగరేణిలో జరుగుతున్న అవినీతి అక్రమాలు, కార్మికులకు జరుగుతున్న అన్యాయం, సింగరేణిని ప్రైవేటీకరణ కుట్రలు, వేల కోట్ల కుంభకోణాలు జరుగుతున్నా సీబీఐ విచారణ చేయించకుండా బీజేపీ కొనసాగిస్తున్న చీకటి ఒప్పందం, తదితర అంశాలపై కార్మిక లోకానికి వివరించి చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.10 వేల కోట్ల కుంభకోణం జరిగిందని రుజువులతో వివరించారు. ఒక్కమాటలో చెప్పాలంటే సింగరేణి ప్రైవేట్ బలిపీఠంపై ఉన్నదని పేర్కొన్నారు. సింగరేణిలో జరుగుతున్న కుంభకోణాలపై బీజేపీ నాయకులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఆగడాలు, దోపిడీకి తెరపడి, సింగరేణి తిరిగి సిరుల గనులుగా మారాలంటే కేసీఆర్ ఒక్కరే శ్రీరామ రక్ష అని స్పష్టంచేశారు. కార్పొరేట్ గద్దల నుంచి కోడి తన పిల్లలను రక్షించుకున్నట్టు ప్రైవేట్‌రంగ సంస్థలను కాపాడుకున్నది కేసీఆర్ ఒక్కరేనని, ఆయనతోనే సింగరేణికి భద్రత ఉంటుందని తేల్చిచెప్పారు. అందుకే భవిష్యత్తులో ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్‌ను గెలిపించాలని కార్మిక లోకానికి కేటీఆర్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

ఉత్పత్తిలో.. ఉద్యమాల్లో మొనగాళ్లు మీరే..

సింగరేణి కార్మికులకు బొగ్గు ఉత్పత్తి మాత్రమే కాదు.. ఉద్యమాలు కూడా ఉత్పత్తి చేయగలరని కేటీఆర్ పేర్కొన్నారు. 'చరిత్ర నిండా కార్మికుల కష్టం ఉన్నది. నల్లబొగ్గుకు నెత్తురు అద్ది ప్రాణాలు కోల్పోయిన వాళ్లు ఉన్నరు. చీకటి గుహల్లో రక్త తర్పణం చేసిన వాళ్లు ఉన్నరు. ఎన్నో త్యాగాలు చేసిన కార్మిక కుటుంబాలు నా కంటే మీకే బాగా తెలుసు. చావుతో సావాసం చేసే కార్మికులు ప్రపంచంలో ఎక్కడైనా ఉన్నారా అంటే.. అది మన సింగరేణిలోనే ఉన్నారని గర్వంగా చెప్పుకోవచ్చు.. మీకు బొగ్గు ఉత్పత్తి చేయడమే కాదు.. ఉద్యమాలు ఉత్పత్తి చేయడమూ తెలుసు.. మీ అందరికీ తెలుసు ఉత్పత్తిలో మొనగాళ్లు మీరు.. ఉద్యమాల్లో కూడా మొనగాళ్లు మీరు. కేసీఆర్ పిలుపు ఇస్తే 35 రోజుల పాటు ఒకసారి, 7రోజుల పాటు మరోసారి మొత్తం 42రోజుల పాటు ఒక్క పెళ్ల రాకుండా మీరు తిరుగబడితే.. దక్షిణాది రాష్ట్రాలు మొత్తం చిమ్మ చీకట్లో ఉన్న సంగతి ఎవ్వరూ మర్చిపోలేరు' అని చెప్పారు. నాడు కేసీఆర్ జంగ్ సైరన్ ఊదితే సింగరేణి గడ్డ అండగా ఉన్నదని గుర్తుచేశారు.



నూతన కలెక్టరేట్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి







- **అధికారులకు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశం**

నల్గొండ, అక్టోబర్ 14 నేటి వెలుగు ప్రతినిధి :

నల్గొండ ప్రస్తుత కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న నూతన కలెక్టర్ కార్యాలయ భవన పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.బుధవారం ప్రస్తుత కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న నూతన కలెక్టరేట్ భవనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సమావేశ మందిరం, ప్రజావాణి హాల్, వీడియో కాన్ఫరెన్స్ హాల్, మంత్రి, కలెక్టర్, అదనపు కలెక్టర్లు, జిల్లా రెవెన్యూ అధికారి ఛాంబర్లతో పాటు ఉద్యోగులు, సిబ్బంది విభాగాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.కార్యాలయంలో అవసరమైన ఫర్నిచర్, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి హాలులో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌండ్ సిస్టం, కంప్యూటర్లు, ప్రొజెక్టర్, ఇంటర్నెట్, ఏసీ, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి గదికి బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌తో పాటు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని, టైల్స్ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.సమావేశ మందిరంలో విద్యుత్ సౌకర్యం, సౌండ్ సిస్టం, సీటింగ్, ఫర్నిచర్, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌కు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. లిఫ్ట్‌లకు అవసరమైన విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేయడంతో పాటు రెండో అంతస్తులోని కార్యాలయాలకు సీసీ కెమెరాలు అమర్చాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ హాలులో టీవీ, మైక్ సిస్టం ఏర్పాటు చేయాలని సూచించారు.భవనంలో ఎక్కడా నీటి లీకేజీలు లేకుండా చూడాలని, గ్లాస్ ఫిట్టింగ్ పనులను నాణ్యతతో పూర్తి చేయాలని, ఫైర్ సేఫ్టీ నిబంధనలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు తప్పనిసరిగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. భవనం చుట్టూ ల్యాండ్‌స్కేపింగ్, పార్కింగ్, తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు, జాతీయ పతాకం ఎగురవేసేందుకు అవసరమైన ఏర్పాట్లు సహా మిగిలిన పనులన్నింటినీ నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.నూతన కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు, అధికారులు, సిబ్బందికి అన్ని విధాలా సౌకర్యవంతంగా ఉండేలా భవన నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ పరిశీలనలో జిల్లా రెవెన్యూ అధికారి దశరథ, ఆర్ అండ్ బీ ఎస్ఈ మోహన్, ఈఈ శ్రీధర్ రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ అభిషేక్, ఎలక్ట్రికల్ డీఈ శృతి, సివిల్ డీఈ ఫణిజ, ఏఈ పుణ్య, ఏవో మోతిలాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పోలింగ్ కేంద్రంలో అక్టోబర్ 16, 17 తేదీల్లో ప్రత్యేక క్యాంపులు





- **అర్హులైన ఓటర్ల నమోదు, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి**
- **జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**

నల్గొండ, అక్టోబర్ 14 నేటి వెలుగు ప్రతినిధి:

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా అక్టోబర్ 16, 17 తేదీల్లో జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో రెండు రోజుల పాటు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లతో ఎస్ఐఆర్ ప్రక్రియ, తాగునీటి సరఫరా, భూభారతి దరఖాస్తుల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 సంపత్సరాలు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యారా లేదా పరిశీలించాలని సూచించారు. కొత్తగా ఓటరు నమోదు చేసుకునేందుకు ఫామ్-6 ద్వారా దరఖాస్తు చేసుకునే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రత్యేక క్యాంపుల్లో తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొనాలని, అవసరమైన పత్రాలు, నోటీసులు, రిజిస్టర్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. బీఎల్ఏలు, బీఎల్ఓలు సమన్వయంతో పనిచేస్తూ రాజకీయ పార్టీల ప్రతినిధులకు క్యాంపుల వివరాలను తెలియజేయాలన్నారు. క్యాంపుల నిర్వహణకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయాలని సూచించారు. తాగునీటి సరఫరాపై ముందస్తు చర్యలు భూభారతి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి భూభారతి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని, రీ-సర్వే ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎంఆర్ఓలు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతిని పరిశీలించాలన్నారు. మండల స్థాయి ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి దశరథ, మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి గణేష్ నగర్ ఉత్సవ కమిటీ భరోసా

- **వెంకన్న కుమార్తె పేరిట రూ.50 వేల ఫిక్స్డ్ డిపాజిట్.. తక్షణ సాయంగా రూ.21 వేలు అందజేత**

నల్గొండ రూరల్ అక్టోబర్ 14 (నేటి వెలుగు ప్రతినిధి):

అనారోగ్యంతో మృతి చెందిన నల్లగొండ మండలం దండంపల్లి గ్రామానికి చెందిన మల్లె బోయిన వెంకన్న కుటుంబానికి ఆయన మిత్రులు, శ్రీ ణేష్ నగర్ ఉత్సవ కమిటీ సభ్యులు అండగా నిలిచారు. కష్టకాలంలో కుటుంబానికి భరోసా కల్పించడంతో పాటు, వెంకన్న కుమార్తె భవిష్యత్తుకు ఆర్థిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ఆమె పేరు మీద రూ.50 వేల ఫిక్స్డ్ డిపాజిట్ చేయాలని కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. అలాగే, కుటుంబ తక్షణ అవసరాల కోసం కమిటీ సభ్య లు కలిసి రూ.11 వేల ఆర్థిక సాయం అందించారు. వెంకన్న చిరకాల మిత్రుడు పామనగుండ్ల నాగార్జున వ్యక్తిగతంగా రూ.10 వేల సహాయం అందించి స్నేహబంధాన్ని చాటుకున్నారు. మాజీ సర్పంచ్ సైదులు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు.మిత్రుడి మరణంతో ఆ కుటుంబం ఎదుర్కొంటున్న కష్టాలను చూసి చలించిన కమిటీ సభ్యులు, తమ వంతుగా అండగా నిలవాలని నిర్ణయించుకోవడం పలువురి ప్రశంసలు అందుకుంటోంది. ఈ కార్యక్రమంలో శ్రీ గణేష్ నగర్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



జాతీయ రహదారి--65పై ఆహార భద్రత తనిఖీలు

7 హోటళ్ల లైసెన్స్‌లు సస్పెండ్.. లైసెన్స్ లేని హోటల్ సీజ్!





నల్గొండ, అక్టోబర్ 14 నేటి వెలుగు ప్రతినిధి:

ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా జాతీయ రహదారి--65పై హోటళ్లు, రెస్టారెంట్లు, ధాబాల్లో టీజీ సేఫ్ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. టీజీ సేఫ్ కమిషనర్ అవినాష్ మహంతి ఐపీఎస్ ఆదేశాల మేరకు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి పర్యవేక్షణలో అక్టోబర్ 13న ఈ తనిఖీలు చేపట్టారు.మొత్తం 10 ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి, ఉమ్మడి నల్గొండ జిల్లాతో పాటు సంబంధిత ప్రాంతాల అధికారుల సమన్వయంతో తనిఖీలు నిర్వహించాయి. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, మెదక్, సంగారెడ్డి జిల్లాలతో పాటు హైదరాబాద్‌లోని క్యూర్ ప్రాంతానికి చెందిన అధికారులు, పోలీసు సిబ్బంది కలిపి సుమారు 60 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

20 సంస్థల్లో తనిఖీలు.. 20 నమూనాల సేకరణ

ఈ ప్రత్యేక డ్రైవ్‌లో మొత్తం 20 ఆహార వ్యాపార సంస్థలను తనిఖీ చేసి, నాణ్యత పరీక్షల కోసం 20 ఆహార నమూనాలను సేకరించారు. తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో ఏడు సంస్థల లైసెన్స్‌లను సస్పెండ్ చేయగా, లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న ఒక హోటల్‌ను సీజ్ చేశారు. అదనంగా ఆరు మెరుగుదల నోటీసులు, ఆరు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఉమ్మడి నివేదికలో పేర్కొన్నారు.

జిల్లాల వారీగా చర్యలు

నల్గొండ జిల్లా: మొత్తం 10 సంస్థల్లో తనిఖీలు నిర్వహించారు. రెండు సంస్థల లైసెన్స్‌లను సస్పెండ్ చేయగా, లైసెన్స్ లేని ఒక హోటల్‌ను మూసివేశారు. మిగిలిన ఉల్లంఘనలకు సంబంధించి నోటీసులు జారీ చేశారు. పప్పుధాన్యాలు, చికెన్ కర్రీ, టీ పొడి, జీడిపప్పు, పనీర్, వంటనూనె, సాస్ తదితర ఆహార పదార్థాల నమూనాలను సేకరించారు.సూర్యాపేట జిల్లా: ఆరు సంస్థల్లో తనిఖీలు నిర్వహించి, మూడు సంస్థల లైసెన్స్‌లను సస్పెండ్ చేశారు. మరో మూడు సంస్థల్లో పరిశుభ్రత లోపాలను గుర్తించి నోటీసులు జారీ చేశారు. పనీర్, సోయా సాస్ నమూనాలను సేకరించారు.యాదాద్రి భువనగిరి జిల్లా: నాలుగు సంస్థల్లో తనిఖీలు చేపట్టి, రెండు సంస్థల లైసెన్స్‌లను సస్పెండ్ చేశారు. నిల్వ విధానాలు, ఖీ×ఖీ/ఖీజుఖీ నిబంధనల ఉల్లంఘనలపై మరో రెండు సంస్థలకు నోటీసులు జారీ చేశారు. ఎర్ర కందిపప్పు, టీ పొడి, అల్లం--వెల్లుల్లి పేస్ట్ నమూనాలను సేకరించారు.

అపరిశుభ్రత.. కలుషిత ఆహార పదార్థాల గుర్తింపు తనిఖీల్లో పలు సంస్థల్లో ఆహార భద్రతకు సంబంధించిన తీవ్రమైన లోపాలను అధికారులు గుర్తించారు. వంటకాల్లో పురుగులు, బొద్దింకలు ఉండటం, అపరిశుభ్రమైన రిఫ్రిజిరేటర్లు, ఫంగస్ పట్టిన కూరగాయలు, ఎలుకల విసర్జనలతో కలుషితమైన పదార్థాలు బయటపడ్డాయి. శాకాహార, మాంసాహార పదార్థాలను కలిపి నిల్వ చేయడం, పచ్చి మాంసంతో పాటు ఐస్ ముక్కలను ఉంచడం, జిడ్డు పట్టిన ఎగ్జాస్ట్‌లు, డ్రైనేజీలో ఆహార వ్యర్థాలు వేయడం వంటి లోపాలను నమోదు చేశారు.కొన్ని సంస్థల్లో అనుమతించని సింథటిక్ ఆహార రంగుల వినియోగం, లేబులింగ్ లోపాలు, సిబ్బంది వైద్య ధ్రువపత్రాలు లేకపోవడం, పురుగుల నియంత్రణకు సంబంధించిన రికార్డులు నిర్వహించకపోవడం వంటి ఉల్లంఘనలను గుర్తించారు. నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందించడమే ప్రత్యేక తనిఖీల ప్రధాన ఉద్దేశమని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి తెలిపారు. హోటళ్లు, రెస్టారెంట్లు, ధాబాల నిర్వాహకులు చెల్లుబాటు అయ్యే ఆహార భద్రత లైసెన్స్‌లను ప్రముఖంగా ప్రదర్శించాలని, వంటగదులు, నిల్వ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆహార పదార్థాల తయారీ తేదీ, వినియోగ గడువు వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై చట్టప్రకారం కఠిన చర్యలు కొనసాగుతాయని ఆమె స్పష్టం చేశారు.

హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రిలో ఎన్ఆర్ఐకి సుఖప్రసవం

ప్రభుత్వ వైద్య సేవలపై నమ్మకంతో ఇంగ్లాండ్ నుంచి వచ్చిన నిహారిక

హుజూర్‌నగర్, అక్టోబర్ 14:

ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న వైద్య సేవలపై నమ్మకంతో ఇంగ్లాండ్ నుంచి వచ్చిన ఎన్ఆర్ఐ శ్రీమతి నిహారిక హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రిలో రెండోసారి సురక్షిత సుఖప్రసవం పొందారు. ప్రభుత్వ వైద్య సేవలపై విశ్వాసంతో ప్రసవం కోసం ప్రభుత్వ ఆసుపత్రిని ఆశ్రయించడం అభినందనీయమని వైద్యాధికారులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ పెండెం వెంకట రమణ, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు, సూర్యాపేట ప్రభుత్వ వైద్య కళాశాల పీడియాట్రిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ జార్జ్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందించే వైద్య సేవలపై ప్రజల్లో మరింత నమ్మకం పెరిగేలా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు.తల్లి, నవజాత శిశువుకు అందించాల్సిన వైద్య సేవలు, ప్రసవానంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బాలింతకు ఆరోగ్య అవగాహన కల్పించారు. తల్లి ఆరోగ్య పరిరక్షణతో పాటు శిశువు సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ ప్రభుత్వ ఆసుపత్రులకు మంచి పేరు తీసుకురావాలని, ప్రతి గర్భిణికి సురక్షిత ప్రసవ సేవలు అందించేందుకు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని వైద్యాధికారులు తెలిపారు.



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్

జిల్లాల మధ్య జల వివాదాలు సృష్టించడం సరికాదు

- పాలమూరు--రంగారెడ్డి, డిండి ప్రాజెక్టుల పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
- ఎదుళ్ల రిజర్వాయర్ నీటి కేటాయింపులపై సామరస్యపూర్వక నిర్ణయం తీసుకోవాలి
- రెండు జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం సమావేశం నిర్వహించాలి
- రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి: శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

నల్గొండ, అక్టోబర్ 14 నేటి వెలుగు ప్రతినిధి:



నీళ్లు, నిధులు, నియామకాల కోసం పోరాడి సాధించుకున్న తెలంగాణలో జిల్లాల మధ్య జల వివాదాలు సృష్టించడం సరికాదని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ప్రాంతాల మధ్య విభేదాలు తలెత్తకుండా, పరస్పర సహకారంతో సాగునీటి సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. బుధవారం నల్గొండలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన సాగునీటి ప్రాజెక్టులు, జల వివాదాలు, కరువు పరిస్థితులు, విద్యుత్ సమస్యలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై మాట్లాడారు.

రెండు జిల్లాల ప్రయోజనాలే లక్ష్యం

మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో పాలమూరు--రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాలను చేపట్టినట్లు గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు. ఎదుళ్ల రిజర్వాయర్ నుంచి రోజుకు 1.5 టీఎంసీల నీటిని పాలమూరు ప్రాంతానికి, 0.5 టీఎంసీల నీటిని డిండి ఎత్తిపోతల పథకానికి కేటాయించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని వివరించారు. ఈ నిర్ణయంపై అనవసర వివాదాలు సృష్టిస్తూ ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు.నార్లాపూర్ నుంచి నీటిని తరలించాలంటే అదనపు ఖర్చుతో పాటు ఎక్కువ సమయం అవసరమవుతుందని, అనుమతుల సమస్యలు కూడా ఎదురయ్యే అవకాశం ఉందని వివరించారు.

సీఎం చొరవ తీసుకోవాలి ఎదుళ్ల రిజర్వాయర్ నుంచి రెండు జిల్లాలకు నీటి కేటాయింపుల విషయంలో ప్రజాప్రతినిధులు పరస్పరం చర్చించుకుని సామరస్యపూర్వక నిర్ణయానికి రావాలని గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకోవాలని కోరారు. మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ఇంజనీర్లు రాజకీయ, ప్రాంతీయ వివాదాలకు అతీతంగా వ్యవహరించి, సాంకేతిక సలహాలతో పనులను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సమగ్రతను, జిల్లాల మధ్య సోదరభావాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. ప్రాజెక్టుల పనుల్లో అనవసర జాప్యం జరగకుండా, రైతులకు వీలైనంత త్వరగా సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కరువు పరిస్థితుల్లో నీటిని పొదుపుగా వినియోగించాలి ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయని, వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోవడంతో జలవిద్యుత్ ఉత్పత్తిపై కూడా ప్రభావం పడుతోందని వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. ముఖ్యంగా రబీ సీజన్‌లో అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా ఆరుతడి పంటల సాగుకు రైతులు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా సాగు ఖర్చులు, నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. రానున్న రోజుల్లో నీటి సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తూ, జిల్లాల మధ్య వివాదాలకు తావులేకుండా పరస్పర సహకారంతో సాగునీటి సమస్యలను పరిష్కరించుకోవాలని గుత్తా సుఖేందర్ రెడ్డి పిలుపునిచ్చారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలి
- నల్గొండ కలెక్టరేట్ ఎదుట ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మెకు సీఐటీయూ మద్దతు

నల్గొండ, అక్టోబర్ 14 నేటి వెలుగు ప్రతినిధి:

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులందరినీ క్రమబద్ధీకరించి పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ సలీం, జిల్లా ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే చర్చలు జరపాలని కోరారు.ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం నల్గొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం రెండో రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరాన్ని సందర్శించిన సీఐటీయూ నాయకులు ఉద్యోగులకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించడం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం ఉండదని అభిప్రాయపడ్డారు.

ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ప్రతి ఉద్యోగికి క్యాడర్ ఫిక్సేషన్ అమలు చేసి, 100 శాతం గ్రాస్ శాలరీ చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేసి, ఉద్యోగులందరినీ స్టేట్ హెల్త్ సొసైటీ (పరిధిలోనే కొనసాగిస్తూ స్పార్క్ ద్వారా నేరుగా వేతనాలు చెల్లించాలని కోరారు.ఉద్యోగి మరణించిన సందర్భంలో వారి కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా లేదా బీమా సౌకర్యం కల్పించడంతో పాటు, కుటుంబంలో ఒకరికి విద్యార్హతను బట్టి ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. ప్రతి ఉద్యోగికి ఉద్యోగ భద్రతతో పాటు ఈహెచ్‌ఎస్/ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, నెలవారీ వేతనాలను ప్రతి నెల 5వ తేదీలోగా చెల్లించాలని డిమాండ్ చేశారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

పెండింగ్‌లో ఉన్న తొమ్మిది నెలల పీఆర్సీ, ఇతర బకాయిలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. జీవో నంబర్ 60, 1195 ప్రకారం పెంచిన వేతనాలను తక్షణమే చెల్లించాలని, వేతనాలు తగ్గిన ఉద్యోగులకు పూర్వపు వేతనాలనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి చర్చలు జరపాలని, డిమాండ్లను పరిష్కరించి సమ్మె విరమణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఇతర ప్రజా, కార్మిక సంఘాల సహకారంతో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నేషనల్ హెల్త్ మిషన్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు డాక్టర్ హరిప్రియ, డాక్టర్ దయానంద్, డాక్టర్ గణేష్, ఉపేందర్, తరాల సురేష్, ఎండీ ఖలీమ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి





- వెనుకబడిన 100 పాఠశాలల్లో ప్రత్యేక డ్రైవ్.. నెల రోజుల్లో 70 శాతం లక్ష్యాల సాధనకు చర్యలు
- పాఠశాలలు, హాస్టళ్లలో డ్రగ్స్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు
- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్గొండ, అక్టోబర్ 14 నేటి వెలుగు ప్రతినిధి :

ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. ముఖ్యంగా అభ్యసనంలో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులతో పాటు హాస్టల్ వార్డెన్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ కార్యక్రమాలపై నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో అభ్యసన పురోగతి తక్కువగా ఉన్న 100 పాఠశాలలను గుర్తించి, ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నవంబర్ 1లోగా నిర్దేశించిన 70 శాతం లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

తరగతి గదుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి అర్థమయ్యే విధంగా ప్రత్యామ్నాయ బోధనా పద్ధతులను అనుసరించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు హోంవర్క్ ఇచ్చినప్పుడు తల్లిదండ్రులకు సమాచారం అందించాలని, అప్పటికీ విద్యార్థుల్లో ఆశించిన పురోగతి కనిపించకపోతే మరో విధానంలో పాఠాలు బోధించాలని తెలిపారు.

పాఠశాలల పరిసరాల్లో డ్రగ్స్ నియంత్రణ

ఇటీవలి కాలంలో పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులు డ్రగ్స్ బారిన పడుతున్న ఘటనలను దృష్టిలో ఉంచుకొని అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలలకు 100 మీటర్ల పరిధిలో పాన్ షాపులు, కిరాణా దుకాణాలు, వైన్ షాపులు వంటి వాటి విషయంలో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునేలా చూడాలన్నారు. ఎక్కడైనా ఇలాంటి దుకాణాలు ఉన్నట్లయితే వెంటనే స్థానిక తహసీల్దార్లు, పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. దసరా సెలవుల అనంతరం జిల్లా స్థాయిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి ప్రతి పాఠశాలలో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ కనెక్షన్లు, లైట్లు, ఫ్యాన్లు నూటికి నూరు శాతం అందుబాటులో ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎక్కడైనా మౌలిక వసతుల కొరత ఉంటే వెంటనే వివరాలతో కూడిన జాబితాను సమర్పించాలని ఆదేశించారు. మరుగుదొడ్లు లేని పాఠశాలల వివరాలను తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారికి అందజేయాలన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, టీజీఈడబ్ల్యూఐడీసీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు ముందుకు వస్తున్నందున వారి సహకారాన్ని కూడా తీసుకోవాలన్నారు. ప్రహరీ గోడలు లేని పాఠశాలల జాబితాను సమర్పించి, సంబంధిత పథకాల కింద నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలల పారిశుధ్య సిబ్బంది వేతన బకాయిల చెల్లింపునకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.

డిజిటల్ విద్యకు ప్రాధాన్యం

ఇంటర్నెట్ సదుపాయం ఉన్న అన్ని పాఠశాలల్లో డిజిటల్ లెర్నింగ్‌తో పాటు ఖాన్ అకాడమీ తరగతులను తప్పనిసరిగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు ఆధార్ కార్డులు అందించే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, 8, 9, 10వ తరగతుల విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించి దరఖాస్తులు చేయించాలని తెలిపారు. తహసీల్దార్ల ద్వారా ఆధార్ కార్డుల జారీకి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.ఈ సందర్భంగా పాఠశాలల్లో సివిల్ పనులు, డ్రాప్ బాక్స్ తదితర అంశాలపై కూడా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి సుసింధర్ రావు, ఎంఈఓలు, ఆర్‌సీఓలు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, టీజీఈడబ్ల్యూఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు





- గర్భిణులు, శిశువుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి
- వైద్యాధికారులు, సిబ్బంది పనితీరుపై ప్రతిరోజూ పర్యవేక్షణ
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ఆనంద్

మేడ్చల్--మల్కాజిగిరి, అక్టోబర్ 14 నేటి వెలుగు ప్రతినిధి

జిల్లాలో అమలవుతున్న అన్ని ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని మెరుగుపరచాలని, వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ఆనంద్ హెచ్చరించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.జిల్లాలోని ఆరోగ్య కార్యక్రమాల అమలుపై నిర్వహించిన అత్యవసర సమీక్ష సమావేశంలో మాతా శిశు ఆరోగ్యం, గర్భిణుల సంరక్షణ, ప్రసవ సేవలు, వ్యాధి నిరోధక టీకాలు, క్షయ వ్యాధి గుర్తింపు, అసంక్రమిత వ్యాధుల నియంత్రణ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. గర్భిణుల సంరక్షణకు ప్రాధాన్యం గర్భిణులకు నిర్దిష్ట సమయంలో వైద్య పరీక్షలు నిర్వహించాలని, హైరిస్క్ గర్భిణులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన వైద్య సేవలు అందించాలని డాక్టర్ ఆనంద్ ఆదేశించారు. నిర్దిష్ట గడువులో ఫోలో-అప్‌లు పూర్తి చేయడంతో పాటు, ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన ఆన్‌లైన్ రికార్డులు, నివేదికలను ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహిస్తూ గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. చిన్నారులకు నిర్దిష్ట సమయంలో టీకాలు చిన్నారులకు నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం వ్యాధి నిరోధక టీకాలు వేయాలని, టీకాలకు దూరమైన పిల్లలను గుర్తించి వారికి టీకాలు అందించాలని అధికారులకు సూచించారు. తల్లి, శిశు ఆరోగ్యానికి సంబంధించిన వివరాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవల నాణ్యత పెంచాలి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రజలకు అందించే వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని డాక్టర్ కె. ఆనంద్ స్పష్టం చేశారు. ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్స, మందులు అందేలా వైద్యాధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. పనితీరుపై రోజువారీ పర్యవేక్షణ ఆరోగ్య కార్యక్రమాల అమలు, ఆన్‌లైన్ అప్‌డేట్లు, నివేదికల సమర్పణపై ప్రతిరోజూ స్వయంగా పర్యవేక్షణ చేస్తానని డాక్టర్ ఆనంద్ తెలిపారు. రోగుల పట్ల నిర్లక్ష్యం, వైద్య సేవల్లో అలసత్వం, విధుల నిర్వహణలో బాధ్యతారాహిత్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు.వైద్యాధికారులు లేదా సిబ్బంది పనితీరు సరిగా లేకపోవడం, రోగుల సంరక్షణలో నిర్లక్ష్యం వహించడం నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అవసరమైన సందర్భాల్లో సంబంధిత అధికార పరిధిలో సేవలను నిలిపివేయడం లేదా విధుల నుంచి తప్పించే చర్యలు కూడా చేపడతామని తెలిపారు.ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి ఆరోగ్య కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ లక్ష్యాలను నిర్దిష్ట సమయంలో సాధించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ఆనంద్ ఆదేశించారు.

Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**